(భూమి బుడమేరు పొంగినట్టు ఏడుస్తుంది. శాంతి' కొట్టుకోపోయి మూరాన కొండకు తట్టుకుంటుంది)

(భవిష్యత్తు)

కొండకోనల
గుండెపగిలిన
చిన్నదానా,
నేనులేరా!
నేను నీకై
ఉక్కు బొంకై
కొత్త రాజుల
గుండెల్లో
గుచ్చుకుంటూ,
విచ్చుకుంటూ
అగ్ని పుష్పం
రెక్క బరువుకు
శిరసు వంచిన
లోహ వల్లిక!
నిక్కు రెక్కల
పావురాయికి
ఓడిపోయిన
ఉక్కు డేగ!
సిగ్గదిసిన
అగ్గిపాదం
తొక్కివేసిన
ఇనప బూబు!
ఇది నిజం,
ఇది బుజం
పూపేసి చెప్పె
వొక నిజం!
ఇది
చీరె కట్టని
చిన్ని సత్యం

# రెఫరెండమ్

ఏ. కె. మణి

లయ తప్పకుండా, 'గప్ గప్' మంటూ రైలు బండి గాలిని దూసుకుని కాలవాహినిలాగ ముందుకు పరుగిడిపోతోంది. ఉయ్యాల ఊపు లాగున్న ఆ కుదుపుకు కునికిపాట్లు రావడ మారంభించాయి. కూర్చుని కునికిపాట్లు పడడమంటే నాకు అసహ్యమవడంచేత, ఆ మగత వదిలించుకోవాలని సిగరెట్టు తీశాను. అది పెదవులమధ్య పెట్టి అగ్గిపుల్ల తీసి గియ్యబోతూ ఉండేసరికి,- నా భుజంమీద ఏదో బరువుగా పడింది. (త్రుళ్ళిపడి నేను ప్రక్కకి తిరిగి చూశాను—ఒక విఘ్నేశ్వరావతారం తన హస్తం నా భుజమ్మీద వేసి నాదృష్టి నాకర్షించే ఉద్దేశంతో కదుపుతున్నాడు!

పొట్టికాళ్ళమీద పెద్దబొజ్జ, పొడుగుపాటి ఖద్దరులాల్చీ, పైన గాంధీటోపీ, చేతిలో సంచి, చేతివ్రేళ్ళకు ఉంగరాలు. చూడగానే 'ఓహో, దిగ్గజాలు భూభారం వహిస్తున్నట్టు, మన దేశ రక్షణబాధ్యతఅంతా(సభ్యతా, సంస్కృతులతో సహా!) నిస్సంకోచంగా వహిస్తూన్న స్వరాజ్య వారసుల్లో తప్పక ఒకరై ఉంటారు.' అని, ఊహించుకున్నాను. వ్రేళ్ళనున్న రవ్వ ఉంగరాలు ఇంజను దీపాల్లాగున్నాయి; అయితే, అవి ధరించడం ఐశ్వర్యప్రలోభము చేతనా, అలంకారాభిలాషనా; అని ఒక్క త్రుటికాలం నాలో నేనే తర్కించుకున్నాను. కాని, వెంటనే ఛా. ఛా. అటువంటి రాజద్రోహపు ఆలోచనలని ఎన్నడూ మనసులోకైనా రానీయకూడదు. అజ్ఞానంచేత అనుకుంటామేగాని అవి ఏవీ ఎంతమాత్రంకావు. అది కేవలం మన దేశపరపతి నిలబెట్టడానికే. భారతదేశం ఐశ్వర్యాని కాటపట్టనీ, అపురూప రత్నగర్భ అనీ, చాటి చూపడానికే వారు సౌఖ్యాలనుభవిస్తూ అలంకారాలు ధరిస్తున్నారని మనం నమ్మితీరాలి! దానికెన్ని నిదర్శనాలు! ఎన్ని ఉదాహరణలు! ఎందరు చిన్న గుమాస్తాలు (పెద్ద కుటుంబాలు) ఎంత మలమలమాడుతూన్నా అవి 'గప్‌చుప్'గా లోలోపలే అణిచేస్తూ, పై ఆఫీసర్ల ఎలవెన్సులకేనా లోటు లేకుండా వారి దర్జా సాగిస్తూ, పదిమందిలో

పదవుల పరువు నిలబెట్టడం లేదు! దేశంలో నున్న వాళ్లు అన్నవస్త్రాలకు లేక అలమటించి పోతున్నా అది తల్చుకు బాధపడుతూ ఇక్కడే కూర్చుని హాతమారిపోతుండగా, రాయబారులుగా కొందరూ, రాజ్యప్రతినిధులుగా కొందరూ, పరదేశసంస్థా పరిశీలనకు కొందరూ, స్నేహాభివృద్ధిసంఘాలుగా కొందరూ,- ఎన్నో పేర్లతో రక్తపుచుక్కలాంటి ప్రజల ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుపెడుతూ (ఆలుబిడ్డలను కూడా విడక!) నిశ్చింతగా నిర్భయంగా విదేశయాత్రలు చేసుకుని వస్తున్నారు కారు! ధనముమీద వారికున్న నిర్లక్ష్యమునకు ఇంతకన్నా వేరే నిదర్శనం ఏంకావాలి! ప్రజాప్రాతినిధ్యాని కింతకన్నా అర్థం తెచ్చేది ఏది? అని నాకు నేనే సమాధానం చెప్పుకుంటూ పరధ్యానంగా అగ్గిపుల్ల గీసి అంటించబోయాను. చటుక్కున నా చెయ్యి పట్టుకుని ఆయన ఆపాడు. నాకు పెద్ద విసుగు వచ్చింది.

'ఇదేమిటి పీడ? ఆయనెవరైనా ఏంచేసినా ఇదేమని నేను ప్రశ్నించకుండా కూర్చున్నప్పుడు నన్ను సిగరెట్టు కాల్చుకోనీకుండా నా చెయ్యి పట్టుకుని ఈయనెందుకాపాలి?' అనే చిరాకుతో ఆయనవేపు చురచుర చూశాను. కాని, నా చూపువేడికాయనేమీ చలించలేదు. (ఖద్దరు బట్టలు కవచంలాగ రక్షిస్తూ ఉంటే, ప్రజాభిప్రాయమంటే భయముండదు గాబోలు!) ఆయన అతిశాంతంతో (అహింసావాదులుగాదూ మరి!) ఎదుటి బల్లమీద వ్రాసియున్న అక్షరాలను వ్రేలితో చూపించాడు.

'పొగ త్రాగరాదు' అని ఉంది ఒకచోట.

'ఓహో, అదా? అలాటి వెన్నో వ్రాసి ఉంటాయి. అవన్నీ ఎక్కడ ఆచరణలో పెడతాము? ఇరవై మంది కూర్చునేది అని ఉంది. మరొక ఇరవై మందికి తక్కువ ఎప్పుడైనా ఉన్నారా?' అన్నాను.

ఆయన తొణక్కుండా, బెణక్కుండా అన్నాడు. 'అవుననుకోండి. అయినా, ఇక్కడున్న వారి కెవ్వరికైనా అభ్యంతర ముందో లేదా మీరు అడగడం విధాయకం.'

'సరే. మీకభ్యంతరముందా?'

'లేదు. నాకు ప్రత్యేకం వ్యక్తిగతంగా ఏమీ అభ్యంతరం లేదనుకోండి. కాని, తక్కినవారి సంగతి?- కనుక, నేను ఉపేక్షించి ఊరుకోను. ఏమైనా మీరు మొట్టమొదట ప్రజాభిప్రాయం తెలుసుకుని మరీ సిగరెట్టు తియ్యాలి.'

మల్లయుద్ధ ప్రదర్శనం ఉల్లాసంగా చూడగల మేమోనని సరదాతో పెట్టెలో ఉన్న వాళ్లంతా మంచి ఉత్సాహంతో లేచి కూర్చున్నారు. కాని, నేను 'ఎవరికైనా నేను సిగరెట్టు కాల్చుకుంటే అభ్యంతరముందా?' అని గట్టిగా అడిగి వాళ్ళందరికీ చాలా ఆశాభంగం కలిగించాను.

'ఉంది' అని కొందరూ, 'లేదు' అని కొందరూ అస్పష్టంగా గొణిగారు. ఏదీ నిశ్చయంగా తేలలేదు.

మరొక ఖద్దరువాలా 'రిఫరెండమ్' పెట్టి ఇది తేల్చాలన్నాడు. ఆయన సూచన బాగుందని ఆమోదించారు చాలవరకు అందరూను. నేను ఒక్కొక్కరిదే ఓటు తీసుకునే ప్రయత్నం ప్రారంభించాను. కలియుగ కబంధుడి లాగున్న ఒకాయన దగ్గరకు వచ్చేసరికి (ఆయన పక్కా దేశ భక్తుడట!) తనవి మూడు ఓట్లన్నాడు. ఒకటి తన ఖద్దరు బట్టలది; మరొకటి భారత పౌరుడిది; మూడు రాజకీయ బాధితుడిది. 'క్విట్ ఇండియా' ఉద్యమం రోజులలో, ఒకవారం ఏ. క్లాసు ఖైదుగా జైల్లోకెళ్ళి ఉన్నాడట!

'అవును ఆయనకి తప్పకుండా మూడు ఓట్లు యివ్వవలసిందే. ముగ్గురు చోటు ఆయనొక్కడూ ఆక్రమించుకొన్నప్పుడు, మూడు ఓట్లుమాత్రం ఎందుకియ్యకూడదు?' అన్నాడో కొంటె విద్యార్థి.

'మూడు టిక్కెట్ల డబ్బుకూడా ఇస్తాడా?' అన్నాడు అతని సహచారి. (కమ్యూనిస్టే అయి ఉంటాడు.)

'అంతే కాదోయ్. ఆయన చూడు ఒక రాజధాని, కొన్ని రాజకూటాలు, కేంద్రప్రభుత్వ ప్రదేశం కలిసినంత ఉన్నాడు. అదనపు హక్కులు ఇయ్యమనడం సహజమేగామా?'

ఇంతలో ఓ సోషలిస్టు మహాశయుడు, ఒక మూలనించి లేచి - మెజారిటీ ఉన్నట్టు కనపడుతూన్న కాంగ్రెసు పక్షంవారు ఎటు ఓటు చెయ్యదలచుకున్నారో తనకి ముందుగా తెలియడము అవసరమన్నాడు. ఏమంటే ప్రతికక్షులుగా నిలవడమే తమపార్టీ ముఖ్యాశయం. కనుక

కాంగ్రెసువారేమంటే దానికి వ్యతిరేకంగా తను ఓటు చెయ్యాలి.

అతని మాటలింకా పూర్తి అయినవో లేదో మధ్యనుంచి ఓ కమ్యూనిస్టు సోదరుడు గప్పుమని పెట్రోలు మంటలాగ యెగసి అందరినీ హడల గొట్టేసాడు. ఈ వ్యాపారమంతా వికృతాకారంతో పైశాచికంగా, ప్రజల్ని పీల్చిపిప్పి జేసేస్తూన్న బూర్జువాదౌర్జన్యమనీ, ఈ కుయుక్తులిక సాగనియ్యననీ; గుక్క తిప్పుకోకుండా గట్టిగా అరిచేసి, నావేపు తిరిగి 'ఎవ్వరి అనుమతి అడగక్కర్లేదు. కాల్చుకో కామ్రేడ్, నీ యిష్టం వచ్చినన్ని సిగరెట్లు కాల్చుకో' అని ఉద్రేకంతో ఉపదేశించాడు.

అప్పటికి బండిలోని ప్రయాణీకు లందరికీ బాగా వేడెక్కింది. 'రిఫరెండమ్' సాగించండి, అనినన్ను ఒత్తిడిచెయ్యసాగేరు. ఆలాగ-అందరూ అనే సరికి, కమ్యూనిస్టుకు ఆపలేని కోపం వచ్చేసింది. రష్యావారు యం. యన్. మీటింగులు బహిష్కరిస్తూ బయటికి పోవడం జ్ఞాపకము వచ్చిందో ఏమో, లేచి తన అసమ్మతిని తెలియజేస్తూ తలుపు తీసుకుని బయట కడుగువేశాడు. గంటకి అరవై మైళ్ళ వేగంతో పోతూన్న రైలులోంచి రివ్వున ఎగిరి కనుమొరగి పోయాడు.

అతనితో పాటే లేచిన సోషలిస్టు, తీవ్రంగా తన అసమ్మతిని తెలియజేస్తూ, ఈమాటు స్టేషనులో రైలు ఆగగానే తను బండివదిలి పోతానని నిక్కచ్చిగా చెప్పేశాడు. (ఆ వచ్చే స్టేషనే ఆయన గమ్యస్థానం! మహానుభావులకి ఆదర్శాలు, అవసరాలూ కలిసివస్తూంటాయి!)

ఈ లోపున కాంగ్రెసు రక్షకుడొకాయన-దేశద్రోహ ప్రచారం చేస్తున్న కమ్యూనిస్టుని, మెత్తగా తన్ని (దౌర్జన్యరహితంగానే!) గట్టిగా బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో, నిష్క్రమిస్తూన్న కామ్రేడుని పట్టుకోబోయి, పట్టుదప్పి ప్రతి కక్షితో పాటే వెంటతరుముతూన్నట్టుగా రైలులోనించి బయటపడి మాయమై పోయాడు.

దేశోద్ధారకుడు ఇంకోకాయన కమ్యూనిస్టనే పేరు చెవుల్లో పడే సరికి క్రొత్త కారప్పొడి కళ్ళల్లో పడ్డట్టుగా ఖంగారుతో లేచి, ఎటో అడుగు వెయ్యబోయి, రైలు కుదుపులో ఆపుకో లేక, నిలువునా పడిపోయి బల్లమధ్య ఇరుక్కుపోయి లేవలేక ఘీంకారధ్వనుల్లో తన లోక భయంకర ప్రతాపాన్ని ప్రజలకి చాటి చూపించసాగాడు.

ఈ గందరగోళం మరుగుని ఏలాగో నేనో సిగరెట్టు కాల్చేసుకున్నాను. దానితో బుద్ధిచురుకుగా పని చెయ్యడం చేత, వెంటనే గొలుసు లాగి, రైలు ఆపేశాను. గార్డు ఇత్యాదులు దిగి బాగా తర్ఫీదైన వైమానికులు విమానంలోనించి, గాలిగొడుగుల ఆసరాతో క్రింద కురుకుతారు గాని, ఆ పేమీ లేకుండానే, పార్టీ భక్త్యావేశంతో రైల్లోనుంచి బయటికి కురికిన ఆ సాహసిక పురోగాముల శరీరాలని వెతికి తీసుకువచ్చి తరువాత స్టేషను చేర్చారు.

మా బండిలో బాగా పైకిరాగలిగే కోర్పున్న విలేఖరి కూడా ఒకడుండి ఉండాలి. మరునాటి వార్తా పత్రికల్లో ఈ వృత్తాంతమంతా ఇలా ప్రకటించబడింది- 'ఐకిట్సేన్' అని సంకేతం.

'శర వేగంతో పోతూన్న మెయిలును, ముక్కలుచెయ్యాలని కమ్యూనిస్టు సాహసంతో చేసిన దారుణ యత్నం ఒక కాంగ్రెసువాది అఖండ ధైర్య, స్థయిర్యాలవల్ల నిష్ఫలమై పోయింది. ఆ మహాశయుడు, ప్రజా క్షేమాని కని తన నిండు ప్రాణాలర్పించాడు. బాంబు వైరుకు నిప్పు ఉద్దేశంతో, కమ్యూనిస్టు ప్రక్కనున్న ప్రయాణికుణ్ణి అగ్గిపెట్టె అడిగినాడు. కొంచెమవతలగా కూర్చున్న కాంగ్రెసు త్యాగ ధీరుడు ఆకుట్రను అనుమానించి చటుక్కున అగ్గిపెట్టెనుతానే అందుకున్నాడు. దానితో కమ్యూనిస్టు ఉగ్రుడైపోయి ఆయనని రైలులోనుంచి క్రిందకి త్రోసివేశాడు. అయితే ఆ ఊపు కు తట్టుకోలేక తనుకూడా ముందుకు పడిపోయాడు. సహాయార్థనుని ఆత్రంతో లేచి వస్తున్న మరొక కాంగ్రెసు నాయకుని వెనుకనుంచి ఎవరో బలంగా తలమీదకొట్టి, బల్లల మధ్యకు త్రోసివేశారు. స్టేషన్ రాగానే ఒక సోషలిస్టు ఖంగారుతో దిగి చరచరా నడుస్తూ, జనసమూహంలో అదృశ్యుడైనాడు. ఈ పరిస్థితుల్లో ఆ కాంగ్రెసు నాయకుని మోదిన ముద్దాయీ అతనే అని అనుకోవడంలో పొరపాటు ఉండదని ఊహిస్తున్నాము.'

(మూలం : శంకర్స్ వీక్లీ)